

పడకేసిన పారిశుద్ధ్యం.. కాలనీలు దుర్గంధం



అస్తవ్యస్తమైన డ్రైనేజీ వ్యవస్థతో కాలనీలు, బస్తీలు కంపుకొడుతున్నాయి. ఎన్‌టీఆర్‌నగర్‌, భగత్‌సింగ్‌నగర్‌, అంబేడ్కర్‌నగర్‌, సిరినగర్‌, మార్గదర్శికాలనీ తదితర అంతర్గత రహదారులపై మురుగు చేరి దోమలు, ఈగలకు ఆవాసాలుగా మారాయి. ఎన్నో ఏళ్లుగా మురుగు మధ్య జీవనం కొనసాగిస్తూ పలు రోగాల బారిన పడుతున్నామని కాలనీ, బస్తీవాసులు వాపోతున్నారు. పేరుకుపోతున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించకపోవడంతో ఈ దుస్థితి నెలకొంటుందని ఆయా ప్రాంతాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు సంబంధిత అధికారులతో మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతున్నారు.

–దిల్‌సుఖ్‌నగర్‌



తవ్వేశారు.. వదిలేశారు

పేదలు నివాసమండే బస్తీలో డ్రైనేజీ కోసం రోడ్డును తవ్విన జలమండలి అధికారులు పనులు పూర్తి చేయడకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సరూర్‌నగర్‌ సర్కిల్‌ పరిధి కొత్తపేట డివిజన్‌లో భరత్‌నగర్‌ కాలనీ, రాజీవ్‌గాంధీనగర్‌లో గతంలో జలమండలి అధికారులు నూతన డ్రైనేజీ పైపులైన్‌ కోసం రోడ్డు తవ్వి పనులు పూర్తయిన తర్వాత రోడ్డు వేయలేదు. తవ్విన రోడ్డుకు మరమ్మతు చేయాలని పలుమార్లు సంబంధిత అధికారులతో మొర పెట్టుకున్నా పట్టించుకునే నాథులే లేరని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భరత్‌నగర్‌ కాలనీలో 1,2,3లో డ్రైనేజీ పైపులైన్ల కోసం తవ్విన రోడ్డును అలాగే వదలేశారు. మట్టి రోడ్లలో గుంతలు ఏర్పడి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట బయటకు వెళ్తే ప్రమాదాలకు గురవుతున్నామని వాపోతున్నారు.

–నాగోలు



రాజీవ్‌గాంధీనగర్‌లో..





భరత్‌నగర్‌ కాలనీలో..

స్వర్ణగిరికి ప్రత్యేక బస్సులు

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌ సిటీ డిపో నుంచి స్వర్ణగిరి టెంపుల్‌కు ప్రత్యేక మెట్రో డీలక్స్‌ బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు మేనేజర్‌ టి.సమత తెలిపారు. ప్రతి శని, ఆదివారం ఉదయం 8 గంటల నుంచి బస్సులు ప్రారంభం అవుతాయని, ఎల్‌బీనగర్‌, ఉప్పల్‌ క్రాస్‌రోడ్డు, ఘట్‌కేసర్‌ మీదుగా ప్రతి గంట నలభై నిమిషాలకు బస్సు ఉంటుందన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు



దిల్‌సుఖ్‌నగర్‌: సరూర్‌నగర్‌/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.13, వంకాయ రూ.18, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.28, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్‌ రూ.18, క్యాబేజీ రూ.08, క్యారెట్‌ రూ.15, దొండ రూ.45, ఆలుగడ్డ రూ.21, ఉల్లిగడ్డ రూ.34, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ.18, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.40, చామగడ్డ రూ.55, మునగ రూ.45, కందగడ్డ రూ.55, బీట్‌రూట్‌ రూ.15, కీర రూ.23, బీన్స్‌ రూ.45, క్యాప్సికమ్‌ రూ.33. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

కూతురితో సహా గృహిణి అదృశ్యం



ఆశ



నిఖిత

హయత్‌నగర్‌: భార్యాభర్తల గొడవతో ఓ గృహిణి కూతురితో కలిసి వెళ్లిపోయిన ఘటన హయత్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కుంట్లూరు రావి నారాయణ రెడ్డి కాలనీలో గుమ్మడి స్వామి, ఆశ (35) దంపతులు కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల ఆశ ఇన్‌స్టాగ్రామ్‌లో చాటింగ్‌ చేస్తుడటంతో భార్యాభర్తల నడుమ గొడవ జరిగింది. దీంతో స్వామి తన భార్య ఆశ, కూతురు నిఖితను తీసుకెళ్లి అంజనాద్రి కాలనీలో ఉండే తన సోదరి వద్ద విడిచిపెట్టి తిరిగి ఇంటికి వెళ్లాడు. కాసేపటి తర్వాత తాను కూడా ఇంటికి వెళ్తానని చెప్పి ఆశ తన కూతురిని తీసుకుని వెళ్లిపోయింది. ఎంతకీ ఇంటికి చేరుకోకపోవడంతో స్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మరో ఘటనలో వృద్ధురాలు..



చిలకమ్మ

హస్తినాపురం: బస్సులో నగరానికి వస్తున్న ఒక వృద్ధురాలు అదృశ్యమైన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం గుంటూరు జిల్లా నర్సరావుపేట మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన నల్లబోతు చిలకమ్మ(60)గురువారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని అమీర్‌పేటకు రావడానికి తన మనుమడు ప్రదీప్‌ కుమార్‌తో కలిసి నర్సారావుపేటలో బస్సు ఎక్కింది. వనస్థలిపురం పనామా చౌరస్తా దగ్గర బస్సు ఆగడంతో ఆమె మనమడికి చెప్పకుండా దిగింది. ఎల్‌బీనగర్‌ రాగానే ప్రదీప్‌కుమార్‌కు చిలకమ్మ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసాడు.

రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న బారికేడ్లను తొలగించండి



బారికేడ్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్‌: కాలనీవాసుల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న బారికేడ్లను తొలగించాలని మన్సూరాబాద్‌ కార్పొరేటర్‌ కొప్పుల నర్సింహారెడ్డి డిమాండ్‌ చేశారు. హైవే కాలనీలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం కార్పొరేటర్‌ మాట్లాడుతూ..ఎల్‌బీనగర్‌ రింగ్‌రోడ్డు జాతీయ రహదారి వద్ద సైకిలింగ్‌ ట్రాక్‌ అంటూ ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌పై తోపుడుబండ్లు, డబ్బాలు ఏర్పాటు చేయటంతో ట్రాఫిక్‌జామ్‌ ఏర్పడుతుందన్నారు. ట్రాఫిక్‌, జీహెచ్‌ఎంసీ అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. కాలనీలోని డ్రైనేజీ తరచూ జామ్‌ ఏర్పడుతుందని పైప్‌లైన్‌లను ఆధునీకరణకు చర్యలు చేపడుతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ప్రభాకర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, వెంకట్‌యాదవ్‌, రవి, నాయకులు హరీష్‌రెడ్డి, సాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడికి బస్సు కష్టాలు



పహాడీషరీఫ్‌ నుంచి ఆటోలో వస్తున్న విద్యార్థులు

- మామిడిపల్లికి సరైన రవాణా వ్యవస్థ లేకపోవడంతో తప్పని తిప్పలు
- ఆటోలను ఆశ్రయిస్తూ ఇబ్బంది పడుతున్న వైనం
- డ్రాపౌట్స్‌గా మిగిలిపోతున్న విద్యార్థులు
- పూర్తిస్థాయిలో బస్సులు నడపాలని గ్రామస్తుల విన్నపం

పహాడీషరీఫ్‌: ఆ గ్రామానికి కూతవేటు దూరంలో ఉన్న శంషాబాద్‌ అంతర్జాతీయ విమానాశ్రయానికి రెండు నిమిషాల్లో వెళ్లి ఎంచక్కా విమానం ఎక్కేయొచ్చు.. ఆహ్లాదకరమైన వాతావరణం కలిగిన ఈ గ్రామం చుట్టూ పెద్దఎత్తున కొనసాగుతున్న విల్లాలు, అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు.. అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో ఏర్పాటవుతున్న కార్పొరేట్‌ విద్యాసంస్థలు.. వెరసి దినదినాభివృద్ధి చెందుతున్న బాలాపూర్‌ మండల పరిధిలోని మామిపల్లి గ్రామానికి ప్రజా రవాణా వ్యవస్థ మాత్రం కరువైంది. దీంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా అన్ని వసతులు, నాణ్యమైన విద్యాబోధనతో దాదాపు 700 మంది విద్యార్థులను కలిగి ఆదర్శంగా మారిన ×మామిడిపల్లి ప్రభుత్వ ప్రాథమిక, జెడ్పీహెచ్‌ఎస్‌₹ విద్యార్థులను రవాణా సదుపాయం తీవ్రంగా వేధిస్తోంది. శ్రీశైలం జాతీయ రహదారి(పహాడీషరీఫ్‌)–బెంగుళూర్‌ జాతీయ రహదారి(శంషాబాద్‌)ల మధ్య ఉన్న తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించి తమ కష్టాలు దూరం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చదువు కంటే రవాణాపైనే ధ్యాస..

మామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చుట్టూ పక్కన ప్రాంతాలైన ఎర్రకుంట, షాహీన్‌నగర్‌, పహాడీషరీఫ్‌, రంగ నాయకుల కాలనీ, బాలాజీ కాలనీ, జల్‌పల్లి గ్రామాల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో విద్యనభ్యసిస్తున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4.15 గంటల మధ్య పాఠశాల కొనసాగుతుంది. దాదాపు 5–10 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చే ఈ విద్యార్థులకు ప్రధాన రవాణ సదుపాయం ఆర్టీసీ బస్సు. గతంలో పూర్తిస్థాయిలోనే బస్సులు నడిపినప్పటికీ, మహేశ్వరం/ఫలక్‌నుమా ఆర్టీసీ బస్సు డిపోలు పరిధిని పంచుకోవడంతో గత కొన్నేళ్ల నుంచి అన్ని సర్వీసులు రద్దు చేసి కేవలం ఒక బస్సును మాత్రమే పాఠశాల విద్యార్థుల కోసమని ఉదయం, సాయంత్రం నడుపుతున్నారు. అది కూడా పాఠశాల సమయానికి అనుగుణంగా బస్సులను నడపకపోవడంతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. మధ్యాహ్నం 3 గంటలకు పహాడీషరీఫ్‌ నుంచి మామిడిపల్లి వచ్చి మళ్లిపోయే బస్సుతో పెద్దగా ప్రయోజనం లేకుండా పోతోంది.

డ్రాపౌట్స్‌గా మిగిలిపోతున్న విద్యార్థులు

చార్మినార్‌ నుంచి బయలుదేరి శంషాబాద్‌ మీదుగా సికింద్రాబాద్‌కు వెళ్లే ఫలక్‌నుమా డిపోకు చెందిన బస్సు చాంద్రాయణగుట్ట, ఎర్రకుంట, షాహీన్‌నగర్‌, పహాడీషరీఫ్‌ మీదుగా ఉదయం 8.20 గంటలకు మామిడిపల్లి గ్రామానికి చేరుకుంటుంది. 9 గంటలకు పాఠశాల ఉండగా ఎర్రకుంట, పహాడీషరీఫ్‌ విద్యార్థులు గంట ముందుగానే 8 గంటలకే బస్సు ఎక్కాల్సి ఉంటుంది. ఈ కారణంగా చాలా మంది విద్యార్థులు బస్సును అందుకోలేక ఆటోలను ఆశ్రయించి డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. ఇలా నిత్యం డబ్బులు ఇవ్వలేక కొందరు తల్లిదండ్రులు పిల్లలను బడి మాన్పిస్తున్నారు. ఇక జల్‌పల్లి, రంగ నాయకుల కాలనీ విద్యార్థులకు బస్సు సదుపాయం లేక నిత్యం 8–10 కిలోమీటర్లు నడక తప్పడం లేదు.

చిన్నపాటి మార్పులతో పరిష్కారం

- ప్రత్యేక బస్సు సర్వీసులతో పనిలేకుండా చిన్నపాటి మార్పులతో ఈ సమస్యకు పరిష్కారం లభించనుంది. ప్రస్తుతం చార్మినార్‌ నుంచి మామిడిపల్లి మీదుగా శంషాబాద్‌కు వెళ్లే బస్సును ఉదయం, సాయంత్రం వేళల్లో అరగంట ఆలస్యం(8.50/4.30)గా నడిపితే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది.
- చాంద్రాయణగుట్ట నుంచి పహాడీషరీఫ్‌ వరకు వచ్చి మళ్లిపోయే బస్సులలో కొన్నింటిని ఉదయం, సాయంత్రం వేళల్లో పక్కనే ఉన్న మామిడిపల్లి మీదుగా శంషాబాద్‌ వరకు నడిపితే ఆర్టీసీకి ఆదాయంతో పాటు ప్రయాణికులకు ఎంతో వెసులుబాటు కానుంది.
- కోఠి నుంచి జల్‌పల్లికి పెద్ద ఎత్తున ఎలాగో బస్సులు నడుస్తున్న దృష్ట్యా ఉదయం, సాయంత్రం పాఠశాల సమయాలలో ఒక్క బస్సునైనా నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న మామిడిపల్లికి నడిపితే విద్యార్థులకు నడక కష్టాలు తీరుతాయి.

వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలి

మన్సూరాబాద్‌: ఈ నెల 10, 11, 12వ తేదీలలో రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో జరిగే దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్‌) ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని సమితి ఎల్‌బీనగర్‌ కార్యదర్శి పాల్వాయి సురేందర్‌ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడుస్తున్నా దళితులు వివక్షకు గురవుతున్నారన్నారు. పాలకులు దళితులను కేవలం ఓటు బ్యాంక్‌గా మాత్రమే వినియోగించుకుంటున్నారని ఆవేదన చెందారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేడ్కర్‌ అభయహస్తంతో ప్రతి దళిత కుటుంబానికి రూ.12 లక్షలు ఇవ్వాలని, ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటమి రేవంత్‌ రెడ్డి పాలనకు రెఫరెండం

నాగోలు: గ్రాడ్యుయేట్లు ఇచ్చిన రెఫరెండాన్ని శిరసావహిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని రెడ్కో మాజీ చైర్మన్‌, బీఆర్‌ఎస్‌ సోషల్‌ మీడియా కన్వీనర్‌ సతీష్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో డిమాండ్‌ చేశారు. ఏడాదిలో 50 వేల ఉద్యోగాలు ఇస్తేనే ఓటు వేయమని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో యువతకు పిలుపునిచ్చారని కానీ అదంతా పచ్చి అబద్ధం కాబట్టే గ్రాడ్యుయేట్లు కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పారన్నారు. అసలు అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలే ఇవ్వలేదు. జాబ్‌ క్యాలెండర్‌ పేరుతో మోసం చేశారు. కొత్తగా ఒక్క నోటిఫికేషన్‌ కూడా ఇవ్వలేదు. ఎన్నికల ముందు యువతకు ఇచ్చిన ఏ ఒక్క మాటను నిలబెట్టుకోలేదన్నారు. ఇకనైనా రేవంత్‌ రెడ్డి తమ అసమర్థతను ఒప్పుకుని రాష్ట్ర ప్రజలు, నిరుద్యోగ యువతకు క్షమాపణలు చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్‌ చేశారు.

లోక్‌ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నాగోలు: ఈ నెల 8న జరిగే జాతీయ లోక్‌ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌బీనగర్‌ ఇన్‌స్పెక్టర్‌ వినోద్‌కుమార్‌ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 8న రంగారెడ్డి జిల్లా లోని అన్ని కోర్టులలో లోక్‌ అదాలత్‌ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇదివరకు కోర్టు ముందుకురాని కేసులు కానీ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు కానీ పరిష్కరించుకునే/రాజీ చేసుకునే వేదిక ఈ లోక్‌ అదాలత్‌ అన్నారు. ఈ జాతీయ లోక్‌ అదాలత్‌లో రాజీకి పడదగ్గ క్రిమినల్‌ కేసులు, సివిల్‌ కేసులు, కుటుంబ తగాదా కేసులు, డబ్బు రికవరీకి సంబంధించిన కేసులు మోటార్‌ వెహికల్‌ యాక్సిడెంట్‌ కేసులు, చిట్‌ ఫండ్‌ కేసులు, ఎలక్ట్రిసిటీ కేసులు, చెక్కు బౌన్స్‌ కేసులు ఇతర రాజీకి వీలున్న కేసులు పరిష్కరించుకోవచ్చు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

హయత్‌నగర్‌: రోడ్డు పక్కన పడిఉన్న ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన గురువారం హయత్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..పెద్ద అంబర్‌పేట్‌లోని సూర్యవంశీకాలనీ దగ్గర యోయో హోటల్‌ సమీపంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుని వయస్సు సుమారు 40 ఏళ్లు ఉంటుందని, బ్లూ, వైట్‌ కలర్‌ షార్టు, పింక్‌ షర్టు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు.

స్వల్పంగా పెరిగిన మిర్చి ధర



మార్కెట్‌లో మిర్చి నిల్వలు

చాదర్‌ఘాట్‌: మలక్‌పేటలోని హైదరాబాద్‌ వ్యవసాయ మార్కెట్‌లో గురువారం మిర్చి దిగుమతి అధికంగా రావడంతో మార్కెట్‌ ప్రాంగణం మిర్చి బస్తాలతో కళకళలాడింది. ఎండు మిర్చి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 42 లారీలు, పది వేల బస్తాలు దిగుమతి అయింది. గురువారం క్వింటాల్‌కు రూ.13,600 పలికింది. గత వారం రోజుల క్రితం రూ. 13 వేలు మాత్రమే ఉండేదని అధికారులు తెలిపారు. ఈ రెండు రోజుల నుంచి స్వల్పంగా ధర పెరిగిందన్నారు. ఇదిలా ఉండగా మిర్చి తీసుకువస్తున్న రైతులకు డిజిటల్‌ బోర్డ్‌ ద్వారా ధరల పట్టిక తెలియజేస్తున్నారు. దాంతో రైతులకు క్వింటాల్‌కు ఎంత ధర వస్తుందని తెలిసిపోతుంది. గతంలో ఈ సౌకర్యం లేదని వ్యాపారులు తెలిపారు. సంవత్సరానికి మార్చి నెల వరకు రూ. 15 కోట్లు ఆదాయం టార్గెట్‌ కాగా, జనవరి నెలలోనే టార్గెట్‌ను అధిగమించినట్లు అధికారులు తెలిపారు.

ఆకట్టుకున్న 'జిజ్ఞాస-2025'



ప్రొఫెసర్‌ శ్రీరాం వెంకటేష్‌కు జ్ఞాపిక అందజేస్తున్న కళాశాల సెక్రటరీ సుధ

సైదాబాద్‌: వినూత్న సాంకేతిక ఆవిష్కరణలకు జిజ్ఞాస వంటి సాంకేతిక ఉత్సవాలు దోహదంచేస్తాయని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్‌ శ్రీరాం వెంకటేష్‌ అన్నారు. గురువారం ఐఎస్‌సదన్‌ డివిజన్‌ వినయ్‌నగర్‌ కాలనీలోని భోజిరెడ్డి మహిళా ఇంజినీరింగ్‌ కళాశాలలో 'జిజ్ఞాస-2025'పేరుతో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవాన్ని ఆయన ప్రారంభించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవంలో ఆంధ్రప్రదేశ్‌, తమిళనాడు సహా పలు రాష్ట్రాల నుంచి 630 మంది విద్యార్థులు అత్యాధునిక ప్రాజెక్టులతో పాల్గొంటున్నారని ప్రోగ్రాం కన్వీనర్‌ ఆర్‌.మంజు భార్గవి తెలిపారు. జిజ్ఞాస ఉత్సవం మొదటిరోజు పలు ఈవెంట్లతో సందడిగా సాగింది. విద్యార్థులు తాము ఎంచుకున్న అంశానికి సంబంధించిన ప్రదర్శనలతో, చక్కటి వివరణలతో తమ సామర్థ్యంతో ఆకట్టుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ప్రొఫెసర్‌ శ్రీరాం వెంకటేష్‌ మాట్లాడుతూ..విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇలాంటి ఉత్సవాలు తోడ్పడుతాయన్నారు. జేఎన్‌టీయూ హెచ్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఆర్‌.శ్రీదేవి మాట్లాడుతూ..విద్యార్థులు తమ సామర్థ్యాలను పెంచుకొని ఉద్యోగాలు కోరుకునే వారిలా కాకుండా ఉద్యోగాలు ఇచ్చేవారిగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ డాక్టర్‌ వి.సుధ, సీఓఓ డాక్టర్‌ సుజాత గంగాధర్‌, అకడమిక్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ గ్రేసీ శైలజ, ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ జె.మాధవన్‌, జి.దయాకర్‌రెడ్డి, కన్వీనర్‌ డాక్టర్‌ పి.దీప్తి పాల్గొన్నారు.

పెండింగ్‌ పనులు పూర్తిచేయాలి



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న సుభాన్‌యాదవ్‌, మాజీ మేయర్‌ పారిజాత తదితరులు

బడంగ్‌పేట్‌: మహేశ్వరం నియోజకవర్గంతో పాటు అతిపెద్ద కార్పొరేషన్‌ అయిన బడంగ్‌పేటలో నిలిచిపోయిన పనులు వెంటనే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మహేశ్వరం నియోజకవర్గ యూత్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు వల్లపు సుభాన్‌ యాదవ్‌ కోరారు. గురువారం తుక్కుగూడకు వివిధ కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు విచ్చేసిన మంత్రిని ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుభాన్‌యాదవ్‌ మాట్లాడుతూ.. నాదర్‌గుల్‌ నుంచి గాంధీనగర్‌ వరకు ఆగిన రోడ్డు విస్తరణ పనులు మొదలు పెట్టేలా చూడాలని, పనులు పూర్తికాగానే సెంట్రల్‌ లైటింగ్‌ సిస్టం పోల్స్‌ ఏర్పాటు చేయించాలని కోరారు. నాదర్‌గుల్‌లోని సున్నం చెరువు నుంచి తుర్కయంజాల్‌లోని మాసబ్‌ చెరువు వరకు వెళ్తున్న వరదనీటి కాలువను అభివృద్ధి చేయించాలని విన్నవించారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌ పక్కన నూతనంగా నిర్మిస్తున్న భవనంలోకి సాగర్‌ రింగ్‌రోడ్డులోని సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయం వచ్చేలా చూడాలని కోరారు. బడంగ్‌పేటలో ఉన్న క్రీడా మైదానం సౌకర్యాలకు నోచుకోవడం లేదని తగిన సౌకర్యాలు కల్పించి క్రీడాకారులకు, యువతకు శిక్షణ ఇచ్చేలా చూడాలన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని ఎంతో మంది నిరుద్యోగ యువతీ యువకులు ఉన్నారని స్థానికంగా ఆదిబట్లలో ఏర్పడిన టీసీఎస్‌, టాటా, ఎయిరో స్పేస్‌ ఇతర కంపెనీల్లో ఉద్యోగాలు స్థానికులకు వచ్చేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. మహేశ్వరంలోని ఎస్‌డీ తండాలో ప్రభుత్వ పాఠశాల వద్ద చెత్త వేస్తూ డంపింగ్‌ యార్డుగా మార్చివేశారని, దీంతో విద్యార్థులు, స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే తొలగించేలా అధికారులను పురమాయించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ మేయర్‌ చిగురింత పారిజాత, ఎస్సీ సెల్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్‌నింగని జంగయ్య, ఎస్సీ డిపార్ట్‌మెంట్‌ చైర్మన్‌ క్యారగారి శ్రీధర్‌, భానుప్రకాశ్‌, యూత్‌ కాంగ్రెస్‌ నాయకులు ఉన్నారు.